

ఫారం-7 పెట్టినవారిపై చర్యలేవీ?

'అర్హుల ఓట్ల తొలగింపు కోసం తప్పుడు సమాచారంతో ఫారం-7 పెట్టినవారు, నకిలీ ఓట్లను చేర్చేందుకు భారీగా ఫారం-6లు పెట్టినవారిని గుర్తించి వారిని వెనుక నుంచి ఎవరు నడిపించారో తేల్చండి. మూలాల్లోకి వెళ్లి వారిపైనా కేసులు నమోదు చేయాల్సిందే. ప్రతి ఫిర్యాదునూ సమీక్షిస్తున్నాం. ఎక్కడైనా బాధ్యుల్ని తప్పిచ్చినట్లు తేలితే తీవ్ర పరిణామాలుంటాయి.'

- మంగళవారం విజయవాడలో జరిగిన కలెక్టర్ల, ఎస్పీల సదస్సులో కేంద్ర ఎన్నికల సంఘం చేసిన హెచ్చరికలివి.

దొంగ ఓట్ల నమోదు, అర్హుల ఓట్ల తొలగింపు విషయంగా ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి మీద తీవ్రంగా ఆగ్రహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా అధికారులు పారదర్శకంగా ఉంటూ, ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకుంటే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు వీరూ బాధ్యులు కాక తప్పదు.



- జిల్లాలో 1.31 లక్షల దరఖాస్తులు అందజేత
- అర్హుల ఓట్ల తొలగింపునకు వైసీపీ కుట్ర
- సహకరించిన పలువురు అధికారులు
- ఆధారాలతోపాటు టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోని వైనం
- కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరికలతోనైనా స్పందిస్తారా?

చిత్తూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించడం.. పెద్దఎత్తున దొంగ ఓట్లను నమోదు చేసుకోవడం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో వైసీపీ పనిచేసింది. బీఎల్వో నుంచి పెద్దస్థాయి వరకు అధికారులంతా వీరికి సహకరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి ఐదుకు మించి తొలగింపు దరఖాస్తులు (ఫారం-7) ఇవ్వకూడదు. కానీ జిల్లాలో వైసీపీ నాయకులతోపాటు వలంటీర్లు కూడా పెద్దఎత్తున ఫారం-7 దరఖాస్తు చేశారు. టీడీపీ నాయకులు ఆధారాలతో పట్టుకుని అధికారులకు ఫిర్యాదు చేసినా కారకుల మీద చర్యలు తీసుకోలేదు. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ విషయంగా తీవ్ర స్థాయిలో స్పందించింది. పెద్దఎత్తున ఫారం-7 దరఖాస్తు చేసినవారితోపాటు వారి వెనుక ఉన్న వారి మీద కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించింది. ఇలాంటి ఘటనలు నగరి, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో అధికంగా ఉన్నాయి. వీటిపై ఇన్నాళ్లూ టీడీపీ నాయకులు చేసిన ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరికలతోనైనా చర్యలు తీసుకుంటారేమో చూడాలి.

■ పుంగనూరులో ఇష్టమొచ్చినట్లు..

ఇంటింటి ఓటరు జాబితా పరిశీలన చేసేటప్పుడు అక్రమ కేసులతో జైళ్లలో.. అజ్ఞాతంలో ఉండిపోయామని పుంగనూరులో నియోజకవర్గ టీడీపీ నాయకులు చెబుతున్నారు. బీఎల్వోల వెంట టీడీపీ ఏజెంట్లు కూడా క్షేత్రస్థాయిలో తిరగలేదు. ఆ సమయంలో వైసీపీ నాయకుల ఆదేశాలనుసారం బీఎల్వోలు ఇష్టమొచ్చినట్లు ఓటు నమోదు, తొలగింపులు చేపట్టారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మిగిలిన నియోజకవర్గాల కంటే అతి తక్కువగా ఇక్కడ ఫారం-7 తిరస్కరణలు ఉండడంతో అనుమానాలు బలపడుతున్నాయి.

నగరి ఫిర్యాదులపై ఏం చేశారు?

- నగరి నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు నిబంధనలకు విరుద్ధంగా పెద్దఎత్తున ఫారం-7 దరఖాస్తు చేశారు. ఈ విషయంగా అక్కడి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ గతేడాది నవంబరు 28వ తేదీన కలెక్టర్ షన్మోహన్‌కు ఆధారాలసహా ఫిర్యాదు చేశారు. నేటికీ కారకుల మీద చర్యలు తీసుకోలేదు.
- విజయపురం మండలంలోని పాతార్కాడు పంచాయతీలోని వలంటీరు వేలాయుధం 19, బుగ్గఅగ్రహారంలోని వలంటీర్ బాలచంద్రన్ 22 ఫారం-7 దరఖాస్తులను అందించారు. పాతార్కాడుకు చెందిన ఆశా వర్కర్ మీనా 14 ఫారం-7లను అప్లై చేశారు.
- పాతార్కాడులోనే సతీష్ అనే వైసీపీ నాయకుడి పేరిట టీడీపీ సానుభూతిపరులకు చెందిన 19 మంది ఓట్లను తొలగించేందుకు ఫారం-7 దరఖాస్తు చేశారు. ఈ విషయం తెలుసుకుని గ్రామస్తులు నిలదీయగా, తాను దరఖాస్తు చేయలేదని.. మంత్రి కార్యాలయం నుంచి ఓటీపీ అడిగితే చెప్పానని అతడు సమాధానం ఇచ్చారు. దీంతో అధికారులు ఆ 19 ఓట్లను తొలగించలేదు.

■ కుప్పంలో ఏకపక్షంగా బీఎల్వోల తీరు

కుప్పం నియోజకవర్గంలో బీఎల్వోలు ఏకపక్షంగా పనిచేశారనే ప్రతిపక్షాల ఆరోపణలకు వారు తిరస్కరించిన ఫారం-6, ఫారం-7 లెక్కలు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో సగటున రెండు వేల ఫారం-7 దరఖాస్తులను తిరస్కరించగా, కుప్పంలో మాత్రం ఏకంగా 8544 తిరస్కరించారు. ఇవన్నీ తమ ఓట్లేనని, వైసీపీ వారి ఆదేశాల మేరకు బీఎల్వోలు పెద్దఎత్తున తొలగించారని టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 'కుప్పం మున్సిపాలిటీలో 179 పోలింగ్ కేంద్రంలో 150 ఓట్లను ఎవరి అనుమతి లేకుండానే తొలగించేశారు. రామకుప్పం ఉస్సిగానిపల్లె పంచాయతీలో సుమారు 200 ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకులు ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. శాంతిపురం తిమ్మరాజుపల్లె పోలింగ్ కేంద్రంలో గ్రామంలో లేని 122 మందిని జాబితా నుంచి తొలగించమంటే పట్టించుకోవడం లేదు.' అని గతంలో టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేసినా.. అధికారులు చర్యలు తీసుకోలేదు.

ఓటు తొలగింపునకు వచ్చిన ఫారం-7, నమోదుకు వచ్చిన ఫారం-6 దరఖాస్తులు.. తిరస్కరణలు

నియోజకవర్గం	వచ్చిన ఫారం-7లు	తిరస్కరించినవి	వచ్చిన ఫారం-6లు	తిరస్కరించినవి
పుంగనూరు	20571	1063	18772	2627
నగరి	20066	3608	11899	1363
జీడీనెల్లూరు	14880	1292	13091	1293
చిత్తూరు	19722	2145	15152	1674
పూతలపట్టు	17358	1457	15614	1578
పలమనేరు	15392	1549	21204	1996
కుప్పం	23854	8544	22087	3552
మొత్తం	131843	19658	117819	14083

ఎన్నికల బదిలీల కసరత్తు
దాదాపు పూర్తి

- పొరుగు జిల్లాలకు వెళ్లనున్న 60 మంది ఎంపీడీవోలు, 22 మంది తహసీల్దార్లు
- రాష్ట్ర కార్యాలయాలకు వెళ్లిన జాబితాలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 13: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ ప్రక్రియతో ప్రమేయమున్న అధికారుల బదిలీలకు సంబంధించిన కసరత్తు దాదాపు 95శాతం పూర్తయింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న జిల్లా, మండల అధికారులతోపాటు సొంత జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేయనున్నారు. ఎంపీడీవోలకు సంబంధించి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జిల్లా పరిషత్ కార్యాలయంలో, తహసీల్దార్లకు సంబంధించి కొత్త జిల్లాల ప్రాతిపదికన కలెక్టరేట్‌లో కసరత్తు పూర్తిచేసి జాబితాలను ఆయా శాఖల రాష్ట్ర కార్యాలయాలకు నివేదించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 65 మంది ఎంపీడీవోల్లో ఫిబ్రవరి నుంచి జూన్ నెలాఖరులోగా ఐదుగురు ఉద్యోగ విరమణ చేయనున్నారు. అందుకని వీరికి బదిలీల నుంచి మినహాయింపు లభించనుంది. మిగిలిన 60 మంది ఎంపీడీవోలు ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పొరుగు జిల్లాలకు వెళ్లనున్నారు. ఈ వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్‌కు పంపినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రెవెన్యూ నుంచి 22 మంది

ఓటరు జాబితా తయారీ మొదలు.. ఓట్ల లెక్కింపు ముగిసేవరకు ఎన్నికల ప్రక్రియలో రెవెన్యూ పాత్ర కీలకం. ఈ నేపథ్యంలో చిత్తూరుజిల్లాలో కొత్తగా ఏర్పడిన చిత్తూరు అర్బన్‌తో కలిసి 32 మండలాలుండగా, ఒకచోట మూడేళ్ల సర్వీసు పూర్తిచేసిన తహసీల్దార్లు అదే క్యాడర్‌లో ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, ఈఆర్వోల వివరాలను రెవెన్యూ శాఖ సేకరించింది. మొత్తం 32 మంది తహసీల్దార్లలో ఎనిమిది మంది జూలై నెలాఖరులోగా పదవీ విరమణ పొందనుండగా, మరో ఇద్దరు ఇతర జిల్లాల నుంచి వచ్చినవారు. మిగిలిన 22 మంది ఇతర జిల్లాలకు బదిలీ కానున్నారు. పదవీ విరమణ చేయనున్న ఎనిమిది మంది తహసీల్దార్లను కలెక్టరేట్‌లో ఇతర సేవలకు వినియోగించుకోనున్నారు. మిగిలిన 22 మంది తహసీల్దార్లు, 60 మంది ఎంపీడీవోలు పొరుగు జిల్లాలైన కడప, అనంతపురం, కర్నూలుకు బదిలీ కానున్నారు. అక్కడి అధికారులు ఇక్కడికి రానున్నారు. ఈ ప్రక్రియ నెలాఖరుకల్లా పూర్తికానుంది.



చిత్తూరులోని కోటహరిజనవాడలో శనివారం అర్ధరాత్రి తర్వాత వేసిన భోగి మంటలు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

- తల్లి, చిన్న కుమారుడి దుర్మరణం
- పెద్ద కుమారుడికి తీవ్రగాయాలు



చంద్రమ్మ, హేమసాయిరెడ్డి (ఫైల్ ఫొటోలు)

బంగారుపాళ్యం, జనవరి 13: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ తల్లి ఆమె చిన్న కుమారుడు దుర్మరణం చెందగా, పెద్ద కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీ జె.కొత్తూరు గ్రామానికి చెందిన చంద్రమ్మ తమ కుమారులు భరత్‌కుమార్ రెడ్డి, హేమసాయి రెడ్డిలతో కలసి శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంలో బంగారుపాళ్యంకు బయల్దేరారు. మార్గమధ్యంలోని చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం మలుపు వద్దకొచ్చేసరికి బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న లారీ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రమ్మ (45), హేమసాయి రెడ్డి (10) అక్కడికక్కడే మృతి చెందారు. పెద్ద కుమారుడు భరత్‌కుమార్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి, క్షతగాత్రుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

వేటగాళ్ల తూటాకు యువకుడి బలి



ఉమాపతి మృతదేహం

బంగారుపాళ్యం, జనవరి 13: అడవి జంతువుల వేటగాళ్ల నాటు తుపాకీ తూటాలకు ఉమాపతి(22) అనే యువకుడు బలయ్యాడు. బంగారుపాళ్యం మండలం కేఎం కండ్రిగ పంచాయతీ నాగాలయిండ్లు సమీపంలోని తూర్పు అటవీప్రాంతంలో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మేతకోసం అడవికి తోలిన ఎద్దు వెనక్కి రాకపోవడంతో ఎగువకంతల చెరువు గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఉమాపతి, శరత్‌లు వారి మేనమామ వెంకటేష్‌తో కలిసి వెతికేందుకు శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో తూర్పు అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. జంతువుల వేటకు వచ్చిన అదే గ్రామానికి చెందిన నాగరాజు, పాండియన్, శేఖర్‌లు వారికి ఎద్దును వెతకడంలో సహకరించారు. ఎద్దు ఆచూకీ దొరక్క పోవడంతో ముందుగా శరత్ ఊరికి వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఉమాపతి, వెంకటేష్‌లు ఇంటికి బయల్దేరారు. దారిలో ఉండగా తుపాకి పేలింది. తూటా తగిలి ఉమాపతి కుప్పకూలిపోయాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని వేటగాళ్లతో కలిసి వెంకటేష్ ఊరి సమీపంలోని బండ వద్దకు తీసుకొచ్చారు. నీళ్లు తాగించే ప్రయత్నం చేశారు. ఉమాపతి చనిపోయాడు. గ్రామస్తులంతా అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులొచ్చి నాగాలయిండ్లుకు చెందిన నాగరాజు, కేఎం కండ్రిగకు చెందిన పాండియన్, వెంకటేష్, శేఖర్‌లపై 304(2) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజు తుపాకీతో కాల్చగా.. పాండియన్, శేఖర్ పక్కనున్నారని పోలీసులు తెలిపారు. ఏదో జంతువు వస్తోందని భావించి పొరపాటుగా ఉమాపతిని తుపాకీతో కాల్చానని నాగరాజు పోలీసులకు, గ్రామస్తులకు వివరణ ఇచ్చుకున్నాడు. అయితే, ఇంట్లో ఉన్న తమ కొడుకుని ఫోన్ చేసి మరీ పిలిపించి.. పొట్టనపెట్టుకున్నారని తల్లిదండ్రులు బేబమ్మ, బాబు ఆరోపిస్తున్నారు. ఉమాపతి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ముగ్గురు సీఐలపై కేసు నమోదు

బీసీవై కార్యకర్తను చెప్పుతో కొట్టిన ఘటనపై స్పందించిన హక్కుల కమిషన్



బీసీవై పార్టీ కార్యకర్తను చెప్పుతో కొడుతున్న సీఐ కృష్ణమోహన్



పుంగనూరు సీఐ రాఘవరెడ్డి



చౌడేపల్లె సీఐ కృష్ణారెడ్డి



గంగవరం సీఐ కృష్ణమోహన్

పుంగనూరు, జనవరి 13: పుంగనూరు సమీపంలోని చదళ్ల వద్ద బీసీవై పార్టీ కార్యకర్తను చెప్పుతో కొట్టి పోలీసుస్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేసిన ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్ స్పందించింది. పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలపై శనివారం కేసు నమోదు చేసింది.చదళ్ల వద్ద శనివారం నిర్వహించాల్సిన బీసీవై పార్టీ ధర్మపోరాట సభ నిర్వహణకు శుక్రవారం ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు అనుమతి లేదని అడ్డుకున్నారు. దీంతో బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రైవేటు స్థలంలో మీటింగ్‌ను ముందురోజే అడ్డుకోవడంపై మండిపడ్డారు.ఈ నేపథ్యంలో పలుమార్లు పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలు రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, కృష్ణమోహన్‌లతో రామచంద్ర యాదవ్‌కు వాగ్వాదాలు జరిగాయి. యాదవ్‌ను అరెస్టు చేయాలని సీఐలు ప్రయత్నించగా సీఆర్పీఎఫ్ భద్రతా బలగాలు, బీసీవైపీ శ్రేణులు అడ్డుపడ్డారు. దీంతో బీసీవైపీ శ్రేణులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకుంటూ, కొడుతూ, పిడిగుద్దులతో కొందరి బట్టలు చింపి స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో బీసీవై పార్టీ కార్యకర్త వెంకటేశ్ జీపు ఎక్కలేదని గంగవరం సీఐ కృష్ణమోహన్ చెప్పుతో కొట్టి లాక్కెళ్లారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రాష్ట్ర మానవహక్కుల సంఘం జాయింట్ సెక్రటరీ టి.కరుణాకర్ యాదవ్ పుంగనూరులో పోలీసుల దాష్టీకంపై శనివారం న్యూఢిల్లీలోని జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.చెప్పుతో కొట్టి అవమాన పరిచిన గంగవరం, పుంగనూరు, చౌడేపల్లె సీఐలు కృష్ణమోహన్, రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్ఆర్సీ 707/ఐఎన్/2024 నెంబరుతో కేసు నమోదు చేసింది.

రామచంద్ర సహా 30మందిపై కేసు

చదళ్ల ఘటనలో పోలీసుల విధులకు అడ్డుపడ్డారంటూ బీసీవైపీ అధినేత బి.రామచంద్రయాదవ్‌తోపాటు 30 మందిపై సీఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేశారు. పుంగనూరు హెడ్‌కానిస్టేబుల్ ఎ.సుబ్రహ్మణ్యం స్పెషల్ రిపోర్టు మేరకు.. చదళ్ల సభ వద్ద 30 పోలీస్‌యాక్టు ఉందని, అందరూ వెళ్లిపోవాలని సూచించగా రామచంద్రయాదవ్, బీసీవైపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్, నవీన్, సుబ్రహ్మణ్యంరెడ్డి, బక్షు, వెంకటేష్, రమేశ్‌యాదవ్, హరిబాబు, సత్యనారాయణ, సురేంద్ర తదితరులపై ఐపీసీ 143, 353, 506 రెడ్‌విత్ 149 సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రిటీషు పాలన కంటే దారుణం

- మానవహక్కుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ

పుంగనూరు, జనవరి 13: పుంగనూరులో పోలీసుల తీరు బ్రిటీషు పాలన కంటే దారుణంగా ఉందని మానవ హక్కుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కరుణాకర్ యాదవ్ విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉందన్న ఆయన రాజ్యాంగం ప్రకారం పనిచేయాల్సిన పుంగనూరు పోలీసులు అధికార పార్టీకోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఇష్ట ప్రకారం వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఓ వ్యక్తిని బహిరంగ ప్రాంతంలో చెప్పుతో కొట్టడమే కాకుండా, బీసీవైపీ కార్యకర్తలను స్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టడం, దుర్భాషలాడటం దారుణమన్నారు. మీటింగ్‌కు వచ్చే వారి ఆధార్‌కార్డుల జెరాక్స్‌లు ఇవ్వమని అడగడం దేశంలో ఎక్కడా లేదన్నారు. జగన్, చంద్రబాబు మీటింగ్‌లకు లక్షల మంది వస్తారు.. అప్పుడు కూడా ఆధార్‌కార్డులు ఇవ్వమంటారా అని ప్రశ్నించారు. చదళ్ల ఘటనపై చిత్తూరు ఎస్పీ, పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలు, మరి కొందరు ఎస్ఐలపై హైకోర్టు, లోకాయుక్తల్లో రిట్ పిటిషన్ వేస్తున్నానని ఆయన తెలిపారు..

పుంగనూరు పెద్దిరెడ్డి జాగీరు కాదు

- బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్

పుంగనూరు, జనవరి 13: 'పుంగనూరు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జాగీరు కాదు. తరచూ ప్రజాస్వామ్యానికి పోలీసులు విఘాతం కలిగిస్తూ బాధితులపైనే కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి బ్లాక్‌డే' అని బీసీవైపీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ అభివర్ణించారు. శనివారం విజయవాడ నుంచి ఆయన మాట్లాడుతూ.. పుంగనూరు సమీపంలోని చదళ్లవద్ద ప్రైవేటు భూమిలోకి పోలీసులు చొరబడి ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ.. తమ కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టేలా ప్రవర్తించారన్నారు. చెప్పులతో కొట్టడం, పిడిగుద్దులు, లాఠీలతో కొట్టి రాజ్యాంగానికి విరుద్ధంతా వ్యవహరించడాన్ని రాష్ట్రం మొత్తం చూసిందన్నారు.సొమ్మసిల్లినా వదలకుండా పోలీస్ జులుం ప్రదర్శించి,భయభ్రాంతులకు గురిచేసి..తనతోపాటు 30 మందిపై కేసులు పెట్టి యావత్ పోలీస్ శాఖకే మచ్చతెచ్చారని వాపోయారు. పుంగనూరు నియోజకవర్గంలో తనపై ఇప్పటికే అక్రమంగా 37 కేసులు నమోదు చేశారన్నారు. పోలీస్ వ్యవస్థను గౌరవించి వెళుతున్నా.. పుంగనూరు పోలీసులు దుర్మార్గంగా పనిచేస్తున్నారని.. ఇక వారి ఆటలు సాగవని హెచ్చరించారు.

ఉత్సాహంతో శ్రమిస్తే జీవితం ఆనందమయమే


జీవీ శ్రీనాథరెడ్డిని సన్మానిస్తున్న హెచ్‌ఎం కుసుమాంబ

సోమల, జనవరి 13: యువకులు ఉత్సాహంతో శ్రమిస్తే జీవితం ఆనందమయం చేసుకోవచ్చునని జడ్పీ మాజీ చైర్మన్ జీవీ శ్రీనాథరెడ్డి అన్నారు. శనివారం నంజంపేట హైస్కూల్‌లో పాఠశాల స్వర్ణోత్సవ ఉత్సవాలను పతాకా విష్కరణతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ప్రత్యేక చొరవ తీసుకుని స్వర్ణోత్సవాలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ క్రమంలోనే 1974 నుంచి పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను, పదవీ విరమణ పొందిన టీచర్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాల్లో హెచ్‌ఎం కుసుమాంబ, సర్పంచు వెంకటరెడ్డి, ఎంపీటీసీ జిన్నా, విశ్రాంత హెచ్‌ఎం రంగారెడ్డి, విద్యార్థి సంఘ నాయకులు నాగభూషణం, మునీశ్వర, నరేంద్ర నాయుడు,లత, కిరణ్మయి, గోపీనాయక్, జగదీశ్, మునిరాజ, ఖయ్యూం, బావాజాన్, పీవీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు


మిస్ కావ్యకు సర్టిఫికెట్ అందజేస్తున్న చైర్మన్ దయానిధి

కుప్పం, జనవరి 13: కుప్పంలోని ఐఆర్‌ఎం కళాశాలలో శనివారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కళాశాల చైర్మన్ బీఎం.దయానిధితో సహా అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై పండుగలో పాల్గొన్నారు. గోపూజ నిర్వహించారు. ముగ్గుల పోటీలు, ఇతర సాంస్కృతిక పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మినీ ఫ్యాషన్ షోలో ఇంటర్ సెకండియర్ బైపీసీకి చెందిన విద్యార్థిని కావ్య మిస్ ఐఆర్‌ఎంగా టైటిల్ గెలుచుకున్నారు. అలాగే బీ.కామ్. ఫైనలియర్ విద్యార్థి విజయకుమార్, మిస్టర్ ఐఆర్‌ఎంగా టైటిల్ సాధించారు. వీరికి చైర్మన్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మనవైన సంస్కృతీ సంప్రదాయాలను మరువకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంద్యాలమడుగులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



రామకుప్పం, జనవరి 13: తెలుగు యవత అధ్వర్యంలో రామకుప్పం మండలం పంద్యాలమడుగులో ఎన్టీయార్ స్మారక క్రికెట్ టోర్నీమెంటును శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం నియోజకర్గ ఇన్‌చార్జి మునిరత్నం ప్రారంభించారు. ఈ టోర్నీలో 30 టీమ్లు పాల్గొంటున్నాయని, టోర్నీ మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజినేయరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ బీసీ సెల్ సమావేశం

రామకుప్పం, జనవరి 13: టీడీపీ రామకుప్పం మండల బీసీసెల్ సమావేశం ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో జరుగుతుందని బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, జిల్లా కార్యదర్శి మనోహర్, నియోజకవర్గ ప్రధానకార్యదర్శి వెంకటరమణ, మండల అధ్యక్ష, ప్రధాపకార్యదర్శులు వేలు, చిన్నసురేష్ తెలిపారు. త్వరలో మండల కేంద్రంలో నిర్వహించనున్న జయహో బీసీ సభ నిర్వహణపై చర్చిస్తామని వారు తెలిపారు.

రేపు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

కల్లూరు, జనవరి 13: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 15వ తేదీన పులిచెర్ల మండలంలో పర్యటిస్తున్నట్లు మండల వైసీపీ అధ్యక్షుడు నాదమునిరెడ్డి తెలిపారు. పాళెం అనందగిరి కొండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మకర సంక్రాంతి వేడుకల్లో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొంటారన్నారు.

సారా ఊట ధ్వంసం

సోమల, జనవరి 13: మండలంలోని పొదలకుంటపల్లె సమీప అటవీ ప్రాంతంలో శనివారం నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. అలాగే వడ్డిపల్లె వద్ద జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 2250 స్వాధీనం చేసుకుని శనివారం పుంగనూరు కోర్టుకు హాజరు పరిచామన్నారు.

జగనన్నకు చెబుదాం!

కోటి సంతకాల సేకరణలో అంగన్వాడీలు




కుప్పంలో అంగన్వాడీల కోసం సంతకాలు చేస్తున్న డాక్టర్ సురేశ్‌బాబు, దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు

కుప్పం, జనవరి 13: కుప్పంలో అంగన్వాడీలు చేస్తున్న నిరసన దీక్షలు శనివారంనాడు కూడా కొనసాగాయి. దీక్షా శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన అంగన్వాడీలు సీఐటీయూ నాయకురాలు లలిత ఆధ్వర్యంలో తమ కష్టాల గురించి 'జగనన్నకు చెబుదాం' పేరుతో కోటి సంతకాల సేకరణ చేశారు. తమకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అణచివేత చర్యలు మానుకోవాలని సీఎం జగన్‌రెడ్డిని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పార్టీ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబుతోపాటు ఆ పార్టీ నాయకులు పలువురు సంతకాలు పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు తీర్చకపోగా వారిపై ఎస్మా ప్రయోగించి ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని స్పష్టం చేశారు. కాగా సామాన్యులు సైతం సంతకాలు చేసి అంగన్వాడీల ఉద్యమానికి తమ మద్దతు తెలిపారు.

అంగన్వాడీలకు మాజీ మంత్రి సంఘీభావం

పలమనేరు : గత 33రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలకు శనివారం పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన పని భారం, పెరగని జీతాలతో సతమతమవుతున్న అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అధికారులు సమస్యలతో రోడ్డు ఎక్కితే తమనాయకుడు భయపడేవారని, జగన్ ప్రభుత్వంలో రోడ్డు ఎక్కడానికి అధికారులు భయపడే భయంకర స్థితి ఉందన్నారు. వారికి పీఆర్‌సీ, డీఏ బకాయిలు ఇవ్వక పోయినా నేడు నోరు మెదపలేని స్థితిలో ఉన్నారన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి టీడీపీ మేనిఫెస్టోలో హామీ లభించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

జగన్ పాలనలో ప్రధాన బాధితులు యువతే : అమర్


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి13: జగన్ పాలనలో ప్రధాన బాధితులు యువతేనని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. శనివారం పలమనేరు మండలం కరిడిమడుగు పంచాయతీ సాంబార్పూర్, నలగాంపల్లి, ఎర్రపెంట, కరిడిమడుగు, జరావారిపల్లి పంచాయతీ పి.ఒడ్డూరు, తెల్లగుండ్లపల్లి, పందేరుపల్లి, జరావారిపల్లి, కాప్పల్లి, దొడ్డిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా జాబ్ క్యాలెండర్ అని నిరుద్యోగులను నిండా ముంచారని ఎద్దేవా చేశారు అప్పుచేసి బటన్ నొక్కడం తప్ప అభివృద్ధి జగన్‌కు సాధ్యంకాదన్నారు. అముల్ డెయిరీకి పాలు పోయకుంటే ప్రభుత్వ పథకాలను కట్ చేయడం తోపాటు స్వయం సహాయక సంఘాల నుంచి తొలగిస్తామని అధికార పార్టీవారు హెచ్చరిస్తున్నారని చాలా మంది పాడి రైతులు ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజ రెడ్డి, జగదీష్‌నాయుడు, గణేష్, స్వతంత్ర్యబాబు, రామమూర్తి నాయుడు, సెల్వరాజ్ కుమార్, రవీంద్రరెడ్డి, జగపతి, జనసేన నాయకులు దిలీప్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



సోమల, జనవరి 13: కర్ణాటక రాష్ట్రంలోని పలు గ్రామాల భక్తులు తిరుమలకు పాదయాత్ర చేస్తూ శనివారం అభయాంజనేయస్వామి ఆలయం వద్ద బస చేశారు. గత 30 ఏళ్లుగా ఏటా పాదయాత్ర చేస్తూ తిరుమలకు చేరుకుంటున్నామన్నారు. ఈక్రమంలోనే మార్గంలోని ఆలయాల వద్ద రాత్రి బస చేసి పూజలు జరిపి పాదయాత్ర కొనసాగిస్తున్నామని తెలిపారు. పాదయాత్రలో ముళ్‌బాగల్, బేత్‌మంగళ్, సంగసంద్రం, వడ్డిపల్లె క్రాస్ తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ తోఫా పంపిణీ



పుంగనూరు, జనవరి13: వైయస్ఆర్ తోఫా పథకం ద్వారా ముస్లింలకు రూ. లక్ష నగదును మున్సిపల్ చైర్మన్ అలీంబాషా అందజేశారు. శనివారం చెంగారెడ్డివీధికి చెందిన అమానుల్లా కుమార్తెకు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ముస్లిం మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ షాదీ పథకం ద్వారా నిధులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇంతియాజ్‌ఖాన్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 276 మంది ప్రతిభ



కుప్పం, జనవరి 13: కుప్పం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 276 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ తెలిపారు. టెక్ మహీంద్ర, టాటా ఎలక్ట్రానిక్స్, అశోక్ లైలాండ్, యూనియన్ బ్యాంక్, టీవీఎస్, డీప్‌వేర్ సొల్యూషన్స్, టాటా తదితర సంస్థలలో ఆఫర్ లెటర్లు సాధించిన విద్యార్థులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి సుమయ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

టీడీపీతోనే వన్నెకుల క్షత్రియుల సంక్షేమం


బోయనపల్లెలో సమావేశమైన వన్నెకుల క్షత్రియులు

శాంతిపురం, జనవరి 13: టీడీపీతోనే వన్నెకుల క్షత్రియుల సంక్షేమం సాధ్యమని శాంతిపురం మండలానికి చెందిన వన్నెకుల పెద్దలు తెలిపారు. మండల పరిధి బోయనపల్లెలో వన్నెకుల క్షత్రియుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలో వన్నెకుల క్షత్రియులకు అన్ని విధాలా అండదండలు లభించాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించి, తిరిగి చంద్రబాబు సీఎం కావడం తథ్యమన్నారు. కుప్పం నియోజకవర్గం నుంచి చద్రంబాబును లక్ష మెజారిటీతో గెలిపించేందుకు అందరు కృషి చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో నేతలు సతీష్‌కుమార్, రామ్మూర్తి, మురుగేష్, నారాయణస్వామి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు

పుంగనూరు రూరల్, జనవరి13: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆసుపత్రిని తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది పనితీరు ఎలా ఉందని ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చిన్న సమస్య ఉన్నా రోగులను మదనపల్లె, తిరుపతి ప్రాంతాలకు తరలిస్తుండేవారని, ప్రస్తుతం ఏరియా అసుపత్రి కావడంతో అన్ని వ్యాధులకు చికిత్సలు ఇక్కడే జరుగుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీకి ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

పుంగనూరు రూరల్, జనవరి13: ఆర్టీసీకి ఆదాయం చేకూరుస్తున్న ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ డ్రైవర్లు చలపతి, అన్వర్ డీజిల్ ఆదా చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే కండక్టర్లు అయ్యప్ప, రామయ్యలు ఆర్టీసీకి ఆదాయం తీసుకురావడంతో వీరికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేసి అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

దాడిపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జనవరి13: తనపై దాడి చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్ప తెలిపారు. ఆయన కథనం మేరకు ... మండలంలోని మోదుగులపల్లెకు చెందిన చంద్రప్ప కుమారుడు గంగధర్ ద్విచక్రవాహనంలో పుంగనూరు నుంచి ఇంటికి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన వెంకట్రమణ, భాస్కర్, రెడ్డెప్పలు ద్విచక్రవాహనంతో ఢీకొని, దాడి చేసి గాయపరిచినట్లు గంగధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

కుమ్మరగుంటలో లోపించిన పారిశుధ్యం



పుంగనూరు రూరల్, జనవరి 13: మండలంలోని వనమలదిన్నె పంచాయతీ కుమ్మరగుంటలో పారిశుధ్యం లోపించి అంటురోగాలు ప్రబలుతున్నా పట్టించుకు నాధుడే కరువయ్యారు. దళితవాడలో తాగునీరు, ఇళ్లలోని వ్యర్థపునీరు వీధుల్లో ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతూ దోమలు వృద్ధి చెందుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగుకాల్వలు నిర్మించి కొళాయిలు మార్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ధర్మపోరాట సభతో పోలీసులకు తిప్పలు


ఫైలాన్‌ను తొలగిస్తున్న పోలీసు

పుంగనూరు,జనవరి13: పుంగనూరు నియోజకవర్గంలో బీసీవై పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్ర యాదవ్ ఏ మీటింగ్ పెట్టాలని నిర్ణయించినా వాటిని అడ్డుకోవ డానికి పోలీసులకు తిప్పలు తప్పడంలేదు. శుక్రవారం చదళ్ల వద్ద బీసీవైపీ ధర్మపోరాటసభ ఏర్పాట్లు చేస్తుండగా ఉదయం 11 గంటల నుంచి పోలీసులు అడ్డుకొనే పనులు చేపట్టారు. పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలు పలమనేరు సబ్‌డివిజన్‌లోని పలువురు సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది, ప్రత్యేకపోలీసు బలగాలు, మహిళా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. సాయంత్రం వరకు పలుమార్లు బీసీవై పార్టీ శ్రేణులు, పోలీసుల మధ్య వాగ్వాదాలు సాగాయి. పోలీసులు దౌర్జన్యంగా వైర్లు కట్ చేయడం, ఫ్లెక్సీలు, కొయ్యలు తొలగించడం జరిగింది. చదళ్లలో సభకు అనుమతిలేదని వివిధ ప్రాంతాల నుంచి మహిళా పోలీసులను రప్పించారు. బీసీవైపీ శ్రేణులను అరెస్టు చేయగా ప్రాంగణంలో రామచంద్రయాదవ్, మరికొద్దిమంది మాత్రమే ఉన్నారు. శనివారం మీటింగ్ ఏర్పాటు చేయడంతో రాత్రి వేళలో పోలీసులు చలికి దగ్గరుండి సభ స్టేజీ, కుర్చీలు, మైకులు, ఫ్లెక్సీలు, కొయ్యలు తొలగించి ఫైలాన్ బెలూన్లకు గాలి తీసి పైన ఎగురుతున్న బెలూన్లు కిందకు దింపారు. రాత్రి 11గంటల వరకు పోలీసులు అక్కడే ఉండి అన్నీ మీటింగ్ ప్రాంతం నుంచి పంపివేసి ధర్మపోరాట సభ జరగకుండా చూశారు. పొలం కావడంతో రాత్రి వరకు చలిలో మాకు ఇదేమి ఖర్మ అంటూ పోలీసులు ఇబ్బందులు పడ్డారు.

కంటి పరీక్ష శిబిరం విజయవంతం



కుప్పం, జనవరి 13: కుప్పంలోని పీఈఎస్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. మొత్తం 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 11 మందిని కంటి శస్త్ర చికిత్సలకోసం ఎంపికచేసి పీఈఎస్‌కు సిఫార్సు చేసినట్లు లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ఎ.మహేశ్, అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్లు సోము, సెంథిల్, శివ, లెనిన్, కృష్ణమూర్తి, సతీశ్, గిరిధర్, పీఈఎస్ వైద్యులు, పీఆర్వో అంజి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆర్థికసాయం

రామకుప్పం, జనవరి 13: రామకుప్పం మండలం విజలాపురం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నేత చిన్న మునెప్ప, 89పెద్దూరుకు చెందిన రాజమ్మలు శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, వైసీపీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి తదితరులు శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. పార్టీ తరపున వారికి రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

పుంగనూరు రూరల్, జనవరి13: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో పేకాట, కోళ్ల పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పుంగనూరు సీఐ రాఘవరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండుగలకు వెళుతున్న ఇళ్లయజమానులు బంగారు, నగదు ఇళ్లలో పెట్టరాదని, ముందస్తుగా స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం, పక్కఇళ్ల వారికి చెప్పి వెళ్లాలని కోరారు. భోగిమంటలు వేసే సమయంలో పిల్లలను భద్రంగా చూడాల్సినబాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

కల్లూరు : పులిచెర్ల మండలంలో కోడిపందేలు, పేకాట, జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండగను ప్రజలు ప్రశాంతం వాతావరణంలో జరుపుకోవాలన్నారు.గ్రామాల్లో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మందలించారని ఆత్మహత్యాయత్నం



పుంగనూరు రూరల్, జనవరి13: మద్యం తాగొద్దని కుటుంబసభ్యులు మందలించారని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పుంగనూరు ఏటిగడ్డపాళ్యంకు చెందిన గణేశ్‌కు మారుడు గంగాధర్(34) కూలీ పనులు చేసి జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిస కావడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన గంగాథర్ బ్లేడ్‌తో గొంతు కోసుకోవడానికి ప్రయత్నం చేశాడు. కుటుంబసభ్యులు అడ్డుకుని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందజేశారు.

నగరిలో చిరుత సంచారం

రెండు లేగదూడల హతం



మృతి చెందిన లేగదూడను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు - మామిడి తోపులో చిరుత పాదముద్ర

ఐరాల, జనవరి 13: ఐరాలకు కూతవేటు దూరంలోని నగరిలో శనివారం వేకువ జామున రెండు లేగదూడలను చిరుత పులి చంపేసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండలంలోని ఈడిగపల్లెకు చెందిన రెడ్డెప్ప తన పశువులను శుక్రవారం రాత్రి నగరిలోని తన మామిడి తోటలో కట్టేశాడు. శనివారం వేకువ జామున తోటలోకి చొరబడ్డ చిరుతపులి అక్కడ కట్టి ఉన్న రెండు లేగ దూడలను చంపేసింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ రేంజ్ అధికారి బాలకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి, పరిశీలించారు. గ్రామం అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రిపూట ఒంటరిగా ప్రయాణించవద్దని, అడవిలో క్రూర జంతువులు కూడా ఉన్నాయని హెచ్చరించారు. అలాగే పశువులను మేత కోసం అడవిలోకి తీసుకెళ్లొద్దని చెప్పారు. ఈ మేరకు గ్రామంలో దండోరా వేయించారు. కాగా.. ఇటీవల నగరికి సమీపంలోని తోకబండ వద్ద ఓ ఆవును చిరుత చంపేసిన విషయం తెలిసిందే.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వెంకటేష్‌నాయక్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి - ఆలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్

ఐరాల(కాణిపాకం), జనవరి 13: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్‌నాయక్ శనివారం కాణిపాక వరసిద్ధుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే స్వామిని పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ దర్శించుకున్నారు. వీరిని ఛైర్మన్ మోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, రాయలసీమ స్త్రీశిశు సంక్షేమ శాఖ రీజనల్ ఛైర్‌పర్సన్ శైలజ, జడ్పీ వైస్ ఛైర్మన్ ధనంజయరెడ్డి, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజు, జడ్పీటీసీ సుచిత్ర, ప్రముఖ పారిశ్రామిక వేత్త పూజారిమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో అన్నదానానికి రూ.4.01 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న గిరిబాబు, వెంకటరెడ్డి

ఐరాల(కాణిపాకం), జనవరి 13: కాణిపాక క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పీలేరుకు చెందిన గిరిబాబు శనివారం రూ.3,01,116 విరాళంగా అందించారు. అలాగే ఎర్రగుంట్లకు చెందిన ఎస్.వెంకటరెడ్డి కూడా రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతలకు ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వామి దర్శనం కల్పించి, శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం

ఒకరి అరెస్టు, కారు సీజ్




మీడియాకు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు, జనవరి 13: అక్రమంగా తరలిస్తున్న రూ.4లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అరెస్టు చేసి, కారును సీజ్ చేశారు. వివరాలను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ విశ్వనాథరెడ్డితో కలిసి డీఎస్పీ శ్రీనివాసమూర్తి శనివారం మీడియాకు తెలిపారు. కొన్ని రోజులుగా కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఒకటో పట్టణ పోలీసులకు వచ్చిన రహస్య సమాచారంతో ఎస్ఐ, సిబ్బంది అశోకపురంలోని గాస్పెల్ చర్చి వద్దకు వచ్చారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న గూలింగ్స్‌పేటకు చెందిన లోకేష్(23) పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతడిని వెంబడించి పట్టుకున్నారు. విచారణలో అతడి ఆధీనంలో ఉన్న ఓ కారును తనిఖీ చేశారు. అందులో కర్ణాటకకు చెందిన రూ.4 లక్షల విలువ చేసే 1,700 మద్యం టెట్రా ప్యాకెట్లు గోనె సంచిలో కనిపించాయి. కారుతోపాటు ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

రేషన్ వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం, జనవరి 13: యానాదివెట్టు గ్రామంలో శనివారం గ్రామస్తులు ఆర్బీకే ఛైర్మన్ మురళినాయుడు ఆధ్వర్యంలో రేషన్ వాహనాన్ని అడ్డుకున్నారు. బియ్యం మినహా కందిపప్పు, గోధుమపిండి, చక్కెర ఇవ్వకపోవడంపై నిలదీశారు. వాహన నిర్వాహకులు డీలర్‌తో మాట్లాడాలని స్పష్టం చేశారు. దీంతో వారు డీలర్ లతతో మాట్లాడగా వచ్చినవి మాత్రమే ఇచ్చామని లేనివి ఎలా ఇవ్వగలమని ఎదురు ప్రశ్నించారు. పైగా దిక్కున్నచోట చెప్పుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిందని మురళి నాయుడు నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పొలం పనుల్లో రైతులు - తిరుమలకు నడిచి వెళుతున్న కర్ణాటక భక్తులు

మంచు సోయగం

ఉదయం తొమ్మిది గంటలు దాటినా పొగ మంచు తెరలు వీడటం లేదు. రోడ్లపై లైట్ల వెలుగులో వెళుతున్న వాహనాలు, వ్యవసాయ పనుల్లో రైతులు, తిరుమల వెంకన్న దర్శనానికి నడిచి వెళుతున్న భక్తులు, ఉదయ భానుడి కిరణాలు శనివారం కనువిందు చేశాయి. - సోమల

కోటి సంతకాలతో 'జగనన్నకు చెబుదాం'

● పలమనేరులో అంగన్వాడీల సమ్మెకు మాజీ మంత్రి అమరనాథ రెడ్డి సంఘీభావం



పలమనేరులో అంగన్వాడీలకు మద్దతు పలుకుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి - కార్వేటినగరంలో సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు

చిత్తూరు, జనవరి 13: జిల్లాలో అంగన్వాడీ వర్కర్లు చేపడుతున్న సమ్మె శనివారంతో 33వ రోజుకు చేరింది. కుప్పం, పలమనేరు ప్రాజెక్టుల్లో ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద, చిత్తూరులో కలెక్టరేట్, కార్వేటినగరంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మెను నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ● చిత్తూరు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేపడుతున్న సమ్మె శనివారం విరామం ప్రకటించి వర్కర్లు పనిచేస్తున్న వార్డుల్లో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులతో తమ సమస్యలను చెప్పి.. సంతకాలు సేకరించారు. ● పలమనేరు సీడీపీవో కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. వీరికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి సంఘీభావం ప్రకటించారు. వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ● కుప్పంలో అంగన్వాడీ వర్కర్లు సీడీపీవో కార్యాలయం వద్ద సమ్మె చేశారు. కోటిసంతకాల సేకరణ చేపట్టారు. ● కార్వేటినగరంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సమ్మె నిర్వహించారు. ఇక్కడా కోటి సంతకాల సేకరణ మొదలుపెట్టారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు.

సంక్రాంతి నుంచి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు

● సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్



ఏఎస్ఎన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 13: సంక్రాంతి పండుగ నుంచి ఖాతాదారుల సౌకర్యార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ సౌకర్యాలతో కూడిన ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తున్నట్లు బ్యాంకు ఛైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. శనివారం చిత్తూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ డిపాజిట్లపై ఇతర బ్యాంకులకంటే 3.5శాతం అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు వివరించారు. 2022-23 ఆర్థికసంవత్సరంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు వ్యాపార లావాదేవీలు రూ.2243 కోట్ల దాకా పెరిగినట్లు చెప్పారు.ఆరు జిల్లాల్లో 240 శాఖలతో నడుస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖలను త్వరలో మరో 10చోట్ల ప్రారంభిస్తామని తెలిపారు. డిపాజిట్లపై 1-2 సంవత్సరాల వరకు సాధారణ ఖాతాదారులకు 7.50శాతం, 60ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్లకు 8శాతం వడ్డీ, 2-3 సంవత్సరాల వరకు 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం అందిస్తామన్నారు. దీనబంధు పథకం కింద బంగారు నగల రుణాలు, ఎస్సీ, బీసీ ఖాతాదారులకు తక్కువ వడ్డీతో బంగారుపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న తరహా బ్యాంకుల్లో అతి తక్కువ నిరర్థక ఆస్తులు కల్గిన బ్యాంకుగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు గుర్తింపు పొందిందన్నారు. తమ బ్యాంకులో ట్యాక్స్ సేవర్ డిపాజిట్ అందుబాటులో ఉందని, దీని ద్వారా ఖాతాదారులు 80-సి రాయితీ పొందవచ్చన్నారు. తమ బ్యాంకులో నిల్వచేసిన బ్యాంకు ఖాతాదారుల సొమ్ముకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఎమ్మెల్యే టిక్కెట్!

వైసీపీలో రెడ్లకు తప్ప అన్ని కులాలకూ అన్యాయమే ● జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్



సమావేశంలో విజయానందరెడ్డిపై ఉన్న కేసుల కాగితాలను చూపుతున్న కిరణ్ రాయల్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 13 : సీఎం జగన్ ఎర్రచందనం స్మగ్లర్‌కు చిత్తూరు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడం దారుణమని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఉన్న ఒక్క బలిజ సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులకు సీటు ఇవ్వకపోయినా వైసీపీని ఆయన వెనకేసుకురావడాన్ని తప్పుపట్టారు. వైసీపీలో రెడ్లకు తప్ప ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులకు ప్రాధాన్యత లేదని విమర్శించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో రెడ్ల స్థానాలు తప్ప అన్ని స్థానాలు మార్చేయడమే దీనికి నిదర్శనమన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్, చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డిపై తమిళనాడు, కర్ణాటక, ఏపీలో 48 కేసులతో పాటు పీడీ యాక్ట్ నమోదైందన్నారు. ఇలాంటి వ్యక్తులను జగన్ ప్రోత్సహిస్తూ ఉంటే ప్రజాస్వామ్యం ఉంటుందా అని ప్రశ్నించారు. స్మగ్లర్‌కు ఉన్న విలువ కాపులకు లేదన్నారు. ఇప్పటికైనా వైసీపీలో ఉన్న కాపులు బయటకు వచ్చి వాస్తవాలు మాట్లాడాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు పవన్ కల్యాణ్‌పై చేసిన ఆరోపణలను ఖండించారు. ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్న మంత్రి రోజాపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజమోహన్, సుమన్‌రాయల్, హిమవంత్, వంశీ, నాగరాజురాయల్, సురేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మధ్యప్రదేశ్‌వాసి దుర్మరణం

కల్లూరు, జనవరి 13: పులిచెర్ల మండలం కల్లూరు - సదుం మార్గంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యప్రదేశ్‌వాసి దుర్మరణం చెందాడు. ఎస్ఐ రవి ప్రకాశ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన గుడ్డు బర్మన్ అనే వ్యక్తి ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుండేవాడు. శనివారం అర్ధరాత్రి కల్లూరు-సదుం మార్గంలో నడుచుకుంటే విధులకు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడేమృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం శవ పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని పీలేరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాళహస్తిలో కోడి పందేలకు భారీ సన్నాహాలు

శ్రీకాళహస్తి, జనవరి 13: శ్రీకాళహస్తి పరిధిలో భారీగా కోడి పందేలు నిర్వహించేందుకు జూదరులు సన్నాహాలు చేసుకున్నట్లు సమాచారం. అడ్డుకునే వారే ఉండరంటూ కొందరు బాహాటంగా చర్చించుకుంటున్నారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ నగర్, ఇదే మండలంలోని రామాపురం, మన్నవరం, వెంకటగిరి సరిహద్దు గ్రామాల్లో, అలాగే తొట్టంబేడు మండలం గద్దగుంట వద్ద భారీ ఎత్తున కోడి పందేలు ఆదివారం ఉదయం నుంచే నిర్వహించేందుకు కొందరు సిద్ధమైనట్టు విశ్వసనీయ సమాచారం.

విశాఖ చేరిన ఇండిగో ప్రయాణికులు

రేణిగుంట, జనవరి 13: తిరుపతి విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం విమానం రద్దు కావడంతో ఆందోళన చెందిన విశాఖ ప్రయాణికులకు శనివారం ఉదయం ఇండిగో యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకున్న విశాఖపట్నం ప్రాంతానికి చెందిన 26 మంది ప్రయాణికులు సాయంత్రం తిరిగి వెళ్లేందుకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు.గంటలకొద్దీ వేచివున్నాక ఇండిగో యాజమాన్యం సర్వీసు రద్దుచేయడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆందోళనకు దిగారు. చివరకు శనివారం ఉదయం 9.50 గంటలకు ఇండిగో యాజమాన్యం విమానం ఏర్పాటు చేసి వారిని విశాఖ పంపింది.

అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్టు

రూ. 8 లక్షల విలువైన రాగి వైర్లు, 3 ద్విచక్ర వాహనాల స్వాధీనం



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న సీఐ గంగిరెడ్డి

చిత్తూరు, జనవరి 13: అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8.26 లక్షల విలువైన రాగి వైర్లు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను చిత్తూరు తాలూకా సీఐ గంగిరెడ్డి పోలీస్‌స్టేషన్ వద్ద మీడియాకు తెలిపారు. కొంతకాలంగా జిల్లాలోని పలు మండలాల్లో వ్యవసాయ బావుల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైర్లను ఎత్తుకెళుతున్నారు. వారం కిందట ఇటువంటి కేసు ఎన్ఆర్‌పేట పోలీసుస్టేషన్‌లోనూ నమోదైంది. విచారణలో దొంగల గురించి కచ్చితమైన సమాచారం అందింది. తాలూకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎన్ఆర్‌పేట ఎస్ఐ కేవీ సుబ్బమ్మ, జీడీ నెల్లూరు ఎస్ఐ రామాంజినేయులు, ఈస్టు సర్కిల్ సిబ్బంది రాజ్‌కుమార్, సుధాకర్ కలిసి ఈ దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచారు. శనివారం ఉదయం ఆరు గంటలకు చిత్తూరు రూరల్ మండలం చిత్తూరు-తిరుత్తణి రోడ్డులోని కుర్చివేడు క్రాస్ వద్ద పాలసముద్రం మండలం కన్నికాపురం దళితవాడకు చెందిన దినేష్(22), వీఆర్‌కుప్పంకు చెందిన ఆదిత్య(19), ఆర్. దినేష్(22), ప్రవీణ్‌కుమార్(23), ఆలీఅబ్బాస్(25), వేలూరు జిల్లా వాలాజాకు చెందిన సూరి ఏళుమలై (23)లను పట్టుకున్నారు. విచారణలో జిల్లాతోపాటు తమిళనాడులోనూ వీరు చోరీలకు పాల్పడినట్లు తేలింది. అనంతరం వారి వద్ద నుంచి రూ.8.26 లక్షల విలువైన 757 కిలోల కాపర్ వైర్లు, 250 మీటర్ల కరెంటు కేబుల్‌వైర్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసులకు నగదు రివార్డులిచ్చి అభినందించారు.

పుంగనూరులో రాజ్యాంగం వర్తించదా?

సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు



చిత్తూరు రూరల్, జనవరి 13: పుంగనూరులో భారత రాజ్యాంగం వర్తించదా.. అని ప్రభుత్వ, పోలీస్ అధికారులను సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు సూటిగా ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పుంగనూరులో శుక్రవారం బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ధర్మపోరాట సభను నిర్వహించడానికి ఆ పార్టీ కార్యకర్తలు సన్నాహాలు చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రకారం సమావేశాలు, సభలు నిర్వహించుకోవడానికి హక్కు ఉన్నప్పటికీ పుంగనూరులో మాత్రం పోలీసులు వ్యవహరించిన తీరు సబబు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అధికార పార్టీకి చెందినవారు తమ సభలు, సమావేశాలు, పుట్టిరోజులు, బస్సు యాత్రలు నడిరోడ్డులో పెట్టుకున్నా పోలీసులు అడ్డుచెప్పడం లేదని వాపోయారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ : ఒంగోలువాసి మృతి

పూతలపట్టు, జనవరి 13: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన రాజేష్, చిన్న మాలకొండయ్యలు పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరు పని నిమిత్తం శనివారం రాత్రి పది గంటలకు పొలకల సంతగేటుకు ద్విచక్ర వాహనంలో వెళుతూ పాటూరు దళితవాడ వద్దకు రాగానే, అదే దళితవాడకు చెందిన నారాయణ పొలకలసంతగేటు నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చిన్న మాలకొండయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు ఎస్ఐ రాంభూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో డ్రోన్ నిషేధంపై అవగాహన కల్పిస్తాం

టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్



తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో డ్రోన్ వినియోగంపై ఉన్న నిషేధం గురించి భక్తులకు అవగాహన కల్పిస్తామని టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్ తెలిపారు. తిరుమల ఘాట్ రోడ్డులో శుక్రవారం డ్రోన్ కెమెరాలో వీడియో తీస్తూ పట్టుబడిన హర్యానాకు చెందిన దినేష్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు చెప్పారు. కెమెరాలో ఘాట్ రోడ్డు విజువల్స్ తప్పా తిరుమలలో ఎక్కడా వీడియో తీసినట్లు లేదన్నారు. ఆయన సెల్‌ఫోన్‌ను కూడా పరిశీలన చేశామన్నారు. ఆర్మీకి చెందిన దినేష్ చాలా బాధ్యత కలిగిన వ్యక్తి అన్నారు. ఆలయాల పర్యటనలో భాగంగా తిరుమలకు వచ్చిన ఆయన కొండలను తీసే ప్రయత్నం చేశారన్నారు. తిరుమలలో డ్రోన్ నిషేధం ఉన్న విషయం ఆయనకు తెలీదన్నారు. పైగా ఆ డ్రోన్ ప్లాస్టిక్‌ది కావడంతో అలిపిరిలో ఉన్న స్కానర్లు స్కాన్ చేయలేదన్నారు. అలిపిరిలో అత్యాధునిక స్కానింగ్ యంత్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కోటి సంతకాల సేకరణతో జగనన్నకు చెబుతాం

- అంగన్వాడీల నిరసన

కార్వేటినగరం, జనవరి 13: అంగన్వాడీల నిరవధిక సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద తమ సమస్యల సాధన కోసం జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి అంగన్వాడీలు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయబద్ధమైన సమస్యల సాధన కోసం జగనన్నకు చెబుదాం అంటూ కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం కార్వేటినగరం మండలాల పరిధలలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షత్రియ కులస్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

● ఆలిండియా క్షత్రియ ఫెడరేషన్ చైర్మన్ పీవీ గిరిరాజు



గిరిరాజుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

పాలసముద్రం, జనవరి 13: క్షత్రియ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆలిండియా క్షత్రియ ఫెడరేషన్ చైర్మన్ పీవీ గిరిరాజు పిలుపునిచ్చారు. పాలసముద్రం మండలం బలిజకండ్రిగలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో శనివారం ఆలిండియా క్షత్రియ ఫెడరేషన్ బీసీసీఐ సౌత్ జోన్ వైస్‌చైర్మన్ గోకరాజు గంగరాజును తిరుత్తణి క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో వేదపండితులతో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ గిరిరాజు మాట్లాడుతూ క్షత్రియులు ఐకమత్యంతో ఉండాలని పిలుపునిచ్చారు. క్షత్రియులు రాజకీయంగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి పదిమందికి చేయూత ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పెద్దలు ఎం.ఎన్. గిరిరాజు, రమేష్ రాజు, బాబు రాజు, శివప్రకాష్ రాజు, మోహన్ రాజు, నాగరాజు, రఘు రాజు తదితరులు పాల్గొన్నారు.

చెంగారెడ్డికి పలువురి శుభాకాంక్షలు



చెంగారెడ్డిని సన్మానిస్తున్న రోజా దంపతులు



చెంగారెడ్డికి పుష్పగుచ్ఛమిస్తున్న గాలి భానుప్రకాష్

నగరి, జనవరి 13: మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డి 91వ జన్మదిన వేడుకలు శనివారం సాయిబాబా గుడి ఆవరణలో జరిగాయి. మంత్రి రోజా, నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్, శ్రీశైలం ట్రస్టుబోర్డు చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేజే శాంతి, నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్, పుత్తూరుకు చెందిన అమ్ములు అలియాస్ ఏలుమలై, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు చిలకం ఈశ్వరప్రసాద రెడ్డి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాల స్థాయిలో ట్యాబుల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), జనవరి 13: జిల్లా విద్యాశాఖకు చేరిన ట్యాబ్‌లను అధికారులు శనివారం పాఠశాల స్థాయిలో పంపిణీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతిలో 16870 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం రాష్ట్ర విద్యాశాఖ తొలి దశలో 5262 ట్యాబ్‌లు, రెండో దశలో శనివారం 11608 ట్యాబ్‌లను జిల్లా విద్యాశాఖకు చేరవేసింది. రెండో శనివారం సెలవుదినమైనా, వీటిని ట్యాబ్ కోఆర్డినేటర్ సుధాకర్ ఆధ్వర్యంలో మండలాలకు పంపారు. పాఠశాల హెచ్‌ఎంలు, టీచర్ల సహాయంతో తల్లిదండ్రుల సమక్షంలో ట్యాబ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ట్యాబ్‌లోని కంటెంట్ ఆధారంగా కేవలం చదువు నిమిత్తం వినియోగించాలని, వీటిని ఎలాంటి పరిస్థితిలోనూ దుర్వినియోగం చేయరాదని హెచ్చరించారు. విద్యార్థులకు అందించి ట్యాబ్ వివరాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపారు.

జీజేఎం ఆధ్వర్యంలో అర్చకులకు సన్మానం



గురజాల జగన్మోహన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

చిత్తూరు సిటీ, జనవరి 13: టీడీపీ సీనియర్‌నేత, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్మోహన్ అర్చకులను ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక టీటీడీ కళ్యాణమండపంలో నగరంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించే అర్చకులను ఆయన సన్మానించారు. సుమారు 350 మంది అర్చకులకు పట్టువస్త్రాలు, కానుక అందించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఈ నెల 15వ తేది తన జన్మదినం సదర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఆయన కోరారు. అనంతరం అర్చకులు ఆయనను వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

నేడు గోదాదేవి కల్యాణం



కోదండరామాలయంలో నమ్మళ్వార్ శాత్తుమొర నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, జనవరి 13: స్థానిక కోదండరామాలయంలో సోమవారం ధనుర్మాసం చివరి రోజున గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకలెక్షన్ బద్రి నారాయణ ఉభయంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శనివారం స్వామివారికి ధనుర్మాసం పాశురాల సందర్భంగా నమ్మళ్వార్ శాత్తుమొరను భక్తి ప్రవత్తులతో అర్చకులు వేణుగోపాల్ బృందం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామి అమ్మవార్లను పూల మాలలతో అలంకరించారు.

ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు

- వైసీపీ నేతల ఆరోపణ

విజయపురం, జనవరి 13: గ్రావెల్ క్వారీ నియంత్రణలో రెవిన్యూ అధికారులు విఫలం అయ్యారంటూ అధికార పార్టీ నాయకులు విమర్శలకు దిగారు. శనివారం విజయపురంలో మండల వైసీపీ అధ్యక్షుడు గోపీనాథ్, వైసీపీ యూత్ అధ్యక్షుడు సతీశ్‌యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని, అధికారులు విచ్చలవిడిగా ఎన్వోసీలు ఇవ్వడం వలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

కళకళలాడుతున్న గ్రామాలు

పాలసముద్రం, జనవరి 13: పట్టణ ప్రాంతాల్లో నివసించే వారంతా సంక్రాంతి పండుగకు తమ స్వగ్రామాలకు రావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ గ్రామాల్లో వున్న ఆలయాలను, గ్రామాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో పాటు బంధువుల రాకతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

సంక్రాంతి సందడి

● కొనుగోలుదారులతో వీధులన్నీ కిటకిట



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న చర్చివీధి

చిత్తూరు కల్చరల్, జనవరి 13: నగరంలో సంక్రాంతి సందడి నెలకొంది. ఆది, సోమ, మంగళవారాల్లో నగరవాసులు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా శనివారం పండుగ సరుకుల కొనుగోలుదారులతో చర్చి, బజారు, పొన్నియమ్మగుడి, శేషపిరాన్‌వీధులన్నీ కిటకిటలాడాయి. భోగి పండుగ సందర్భంగా రేగుపళ్లు, చెరకు గడలు, పూలు, పండ్లు, స్వీట్లు కొనుగోలు చేశారు. అదే విధంగా నగరంలోని గిరింపేట, రైతుబజారు, కొంగారెడ్డిపల్లె, మార్కెట్, సంతపేట తదితర ప్రాంతాల్లో స్థానికులు సరుకులు కొనుగోలు చేయాడానికి దుకాణాలకు ఎగబడ్డారు.

పతంగుల ద్వారా ఓటు హక్కుపై అవగాహన



పతంగులతో యువత, విద్యార్థులు, అధికారులు

చిత్తూరు, జనవరి 13: చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై శనివారం వినూత్నరీతిలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఓట్ ఈజ్ రైట్.. ఓట్ ఫర్ ష్యూర్ అంటూ రాసిన నినాదాలతో కూడిన పతంగులను ఎగురవేస్తూ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2024 కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు కమిషనర్ అరుణ మార్గనిర్దేశంలో నగరపాలక అధికారులు శనివారం మెసానికల్ మైదానంలో యువత, విద్యార్థులతో కలిసి గాలి పటాలను ఎగురవేశారు. ఓటు హక్కు విలువ తెలిసేలా నినాదాలు రాసిన గాలిపటాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహా, వార్డు, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకే అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ

చిత్తూరు, జనవరి 13: ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసు శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తోందని ట్రాఫిక్ డీఎస్పీ విష్ణురఘువీర్ అన్నారు. శనివారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ నగరంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోందని, తదనుగుణంగానే చర్యలు చేపడుతున్నామన్నారు. గత సంవత్సరాలతో పోల్చుకుంటే మృతుల సంఖ్యను ట్రాఫిక్‌శాఖ గణనీయంగా తగ్గించడానికి కృషి చేసిందని చెప్పారు. నగర ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ సంక్రాంతి పండగను జరుపుకోవాలని సూచించారు. ఈ మీడియాసమావేశంలో సీఐ నిత్యబాబు, ఎస్ఐ బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దాం

- మాజీ ఎమ్మెల్సీ దొరబాబు



ప్రమాణం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

తవణంపల్లె, జనవరి 13: టీడీపీ గెలుపే లక్ష్యంగా అధినేత చంద్రబాబును సీఎం చేయడమే ధ్యేయంగా కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండలంలోని కాణిపాకంక్రాస్ వద్ద గల సీడీఎం కల్యాణ మండపంలో పూతలపట్టు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి మురళిమోహన్ ఆధ్వర్యంలో ఐటీ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలతో రానున్న ఎన్నికల్లో గెలుపుకోసం చేపట్టవలసిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీ ఉద్యోగులు 2014, 2019 ఎన్నికల్లో టీడీపీకి వచ్చిన ఓట్ల శాతం, బూత్ లెవల్‌లో సాధించిన ఓట్ల తేడాను సాంకేతికతో డిజిటల్ స్క్రీన్‌పై ప్రెజెంటేషన్ చేసి చూపించారు. అలాగే ఇతర రాష్ట్రాల్లో గల ఓటర్లను గుర్తించడం, ఓట్లు వేయడానికి వచ్చేందుకు అవగాహన కల్పించడం, ఎన్నికల్లో బూత్‌లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రెజెంటేషన్ వేసి చూపించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే యువతకు భవిష్యత్తు అని, రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ఐటీ ఉద్యోగులు పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో పార్టీ విజయానికి కృషిచేస్తామని ప్రమాణం చేశారు. టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండలాధ్యక్షులు గాలి దిలీప్, దొరబాబు, గిరిధర్‌బాబు, మురార్జి యాదవ్, జయప్రకాష్ నాయుడు, వెంకటేష్‌చౌదరి, కోదండయ్య, మోహన్ నాయుడు, సునీల్‌చౌదరి, 500మంది ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం నాలుగున్నరేళ్లుగా వైసీపీ నేతల ఎదురుచూపులు

గంగాధరనెల్లూరు, జనవరి 13: మండలంలోని 170 హ్యాబిటేషన్ గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని సరఫరా చేసిన తర్వాత ఆ బిల్లులకోసం ఆఫీసుల్లో అధికారుల చుట్టూ నాలుగున్నర ఏళ్లుగా వైసీపీ నేతలు తిరుగుతున్నారు. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక, మింగలేక వారు మదనపడిపోతున్నారు. 2019వ సంవత్సరంలో టైఅప్, ట్రాన్స్‌పోర్ట్‌తో ట్యాంకర్ల ద్వారా మండలంలోని 170 హ్యాబిటేషన్ గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని సరఫరా చేశారు. అలా సరఫరా చేసిన వీరికి జూలై నెలలో రూ.59 లక్షలు, ఆగస్టు నెలలో రూ.59 లక్షలు, సెప్టెంబర్ నెలలో రూ.39 లక్షలు బిల్లులను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, మొత్తంగా రూ.1.57 కోట్లు బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఈ బిల్లులు మంజూరు చేయాలని అధికారపార్టీ నేతలు మండల, జిల్లా అధికారులు, డిప్యూటీ సీఎంలకు అర్జీలద్వారా విన్నవించారు. కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌సెల్‌లో సైతం అర్జీలద్వారా తమగోడును వెళ్లబోసుకున్నారు. నాలుగున్నరేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి బిల్లుల విడుదల కోసం టైఅప్, ట్రాన్స్‌పోర్ట్ ట్యాంకర్ల నిర్వాహకులైన అధికారపార్టీ నేతలు ఎదురుచూస్తున్నారు.

టీడీపీ గెలుపుతోనే నగరి అభివృద్ధి



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న భానుప్రకాష్

నగరి, జనవరి 13: టీడీపీ గెలుపుతోనే నగరి పట్టణ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణ పరిధిలోని ఆరు, ఏడవ వార్డులలో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో భానుప్రకాష్ ఇంటింటికి వెళ్లి గ్యారెంటీ కరపత్రాలు పంపిణీచేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి నగరి ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పిస్తే పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసన్, రుక్కుం బాలాజీ, టీఎన్‌టీయూసీ బాలాజీ, సురేష్‌మోహన్, సురేష్‌నాయుడు, గుణశేఖర్, జ్యోతినాయుడు, మోహన్, కృష్ణారెడ్డి, ఆర్ముగం, సుబ్బన్న, కృపాకర్‌నాయుడు, సుబ్బులు, అల్లిముత్తు, వెంకటాచలం, గణేషుల్ పాల్గొన్నారు.

ముగ్గులు సంప్రదాయాలకు ప్రతీక



ముగ్గులను పరిశీలిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కల్చరల్, జనవరి 13: భారతీయ సంప్రదాయాలకు ముగ్గులు, రంగవల్లులు, అరివేణి, కంలంకారీలు ప్రతీకలు అని ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎం.సి. విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం కొంగారెడ్డి పల్లెలోని విజయానందరెడ్డి కార్యాలయం వద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఝాన్సీకి మొదటి బహుమతి కింద రూ.10 వేలు, సరితకు రెండవ బహుమతిగా రూ.7 వేలు, మూడవ బహుమతిగా శశికి రూ.4 వేలు నగదు బహుమతులతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న వారందరికి గిఫ్ట్ హాంపర్స్ అందజేశారు. అదేవిధంగా నగరంలో జువారి సిమెంట్ మర్చంట్ అసోసియేషన్, సివిల్ ఇంజనీర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కట్టమంచి చెరువు కట్టపై సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగాయి. కార్యక్రమంలో గెలుపొందిన మహిళలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జువారి సిమెంట్స్ అధికారులు యం.లోకేష్, టి.యస్. సంతోష్, ఎ. జయచంద్రారెడ్డి, ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు కె. జయప్రకాష్, విజయశేఖర్, బాలాజి, గుణశేఖర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్లకు మోక్షం ఎప్పుడో?

- ప్రమాదపు అంచుల్లో ప్రయాణికులు



ఎంసీఆర్ క్రాస్, సీకేపల్లి వద్ద గుంతలమయంగా వున్న తారురోడ్డు

గుడిపాల, జనవరి 13: మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని సీఎంసీ వద్ద లక్ష్మీపురం, దళవాయిపల్లె పెట్రోల్ బంకు వద్ద, ఎంసీఆర్ క్రాస్ రోడ్డు, అనుపు సమీపంలో గుంటలు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై సంబంధిత ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో రాత్రివేళల్లో కొంతమంది పడిలేచి గాయాలపాలౌతున్నారు. మరికొంతమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇదిలా వుండగా కొత్తపల్లి క్రాస్ నుంచి సీకేపల్లి వెళ్లే తారురోడ్డు, చీలాపల్లి క్రాస్ నుంచి పేయనపల్లికి వెళ్లే తారురోడ్డు ఇరుపక్కలా కోసుకుపోవడంతో అక్కడక్కడా గుంతలు ఏర్పడి ఎక్కడ పల్లం, ఎక్కడ మిట్ట ఉందో తెలియక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ధర్నా చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

పల్లెల్లో ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు

విజయపురం, జనవరి 13: మండలంలోని పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకొని పిల్లలు మొదలు పెద్దల వరకు భోగి మంటలు వేయడానికి ముళ్ల కంపలను, చెరకు ఆకులను, పెద్ద మొక్కలను సేకరించారు. వీధుల్లో ముగ్గులు వేయడానికి మహిళలు శుభ్రం చేసుకున్నారు. మండలంలోని విజయపురం, కోసలనగరం, జంబాడ, పాతార్కాడు, మహారాజపురం తదితర గ్రామాల్లో సంక్రాంతిని పురస్కరించుకొని డ్యాన్సులు, ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించడానికి యువత ఏర్పాట్లు చేస్తున్నారు.

వైసీపీ ఎమ్మెల్యేల్లో సగానికి పైగా క్రిమినల్ కేసులున్నవారే: టీడీపీ

చిత్తూరు సిటీ, జనవరి 13: వైసీపీ ఎమ్మెల్యేల్లో సగానికి పైగా క్రిమినల్ కేసులున్న వారేనని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆరోపించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కూడా సీఎం జగన్ క్రిమినల్ కేసులున్నవారు, ఎర్రచందనం స్మగ్లర్లు, గంజాయి, అంతర్రాష్ట్ర మద్యం విక్రయించేవారు, ఇలా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే నేరస్తులకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయిస్తున్నారని విమర్శించారు. మాజీ మేయర్ కటారి హేమలత మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మోసం చేస్తున్నారని చెప్పారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేల టికెట్ల కేటాయింపుకు జగన్ విధించిన షరతులపై ఆపార్టీ ఎమ్మెల్యేలే వ్యతిరేకత వ్యక్తంచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేత రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

పెనుమూరు, జనవరి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని కలిగిరి సచివాలయ పరిధిలో మొరవకండ్రిగ, నంజరపల్లి పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ఉండి అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందని వారికి పథకాలను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం డ్రోన్‌తో రైతులు త్వరగా పంటలకు మందులను పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఏపీవో మీనాకుమారి, ఏపీఎం హరిక్రిష్ణారెడ్డి, వ్యవసాయ అధికారి కళ్యాణ్‌బాబు, సర్పంచ్ ఊహ, లావణ్య, జన్న శ్రీ పాల్గొన్నారు.

నారాయణస్వామికే మళ్లీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

గంగాధరనెల్లూరు, జనవరి 13: డిప్యూటీ సీఎం నారాయణస్వామికే మూడవసారి మళ్లీ గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీపీ అనిత, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, మామిడి రైతుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజారమేష్ డిమాండ్ చేశారు. శనివారం గంగాధరనెల్లూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ నారాయణస్వామిని చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పంపించకుండా, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగానే టికెట్ కేటాయించాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో నేతలు గుణశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, బలరామిరెడ్డి, నరసింహులు నాయుడు, రఘునాథరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, గోవిందరెడ్డిలు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచుల్లో ఎస్సీ బాలుర హాస్టల్

- విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం - ముందస్తు చర్యలు అవసరం



ఎస్సీ బాలుర హాస్టల్

శ్రీరంగరాజుపురం, జనవరి 13: ఎస్ఆర్‌పురం మండలం 49 కొత్తపల్లిమిట్ట సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలుర వసతి గృహం పాతదై పోవడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ హాస్టల్‌లో 48 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్ భవనపు గదులు మరమ్మతులకు నోచుకోకుండా ప్రమాదపుటంచుల్లో ఉన్నాయి. వానొస్తే ఉరుస్తోంది. హాస్టల్ ఆవరణం అపరిశుభ్రంగా పిచ్చిమొక్కలతో విషపురుగులకు ఆవాస కేంద్రంగా మారిందని విద్యార్థులు అంటున్నారు. భవనం పైపెచ్చులు ఊడి పడుతున్నాయి. స్నానం చేయడానికి స్నానపు గదులు లేవు. దీంతో ఆరు బయటే స్నానం చేస్తున్నారు. ఇకపోతే తాగునీటి కొళాయి పరిస్థితి అధ్వానంగా ఉంది. మరమ్మతులకు గురైన చోట మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే మూల్యం చెల్లించక తప్పదు. ముందస్తుగా విద్యార్థులకు రక్షణ ఉండే భవనంలోకి హాస్టల్ మార్చాల్సి ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. హాస్టల్ నిర్వహణపై నిర్లక్ష్యం తగదని అంటున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తగినచర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న శ్లాబు